



EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
గురువారం
05-06-2025
పేజీలు: 02




# థగ్ లైఫ్ సినిమా రివ్యూ

లెజండరీ ఫిలిం మేకర్ మణిరత్నం, లెజండరీ యాక్టర్ కమల్ హాసన్ ల క్రేజీ కాంబినేషన్ లో దాదాపు 38 ఏళ్ల తర్వాత వచ్చిన చిత్రం "థగ్ లైఫ్". ఈ సినిమాపై భీభత్సమైన అంచనాలున్నాయి. ఎనౌన్స్ మెంట్ టీజర్ కే అందరికీ మైండ్ బ్లాక్ అయ్యింది. ఇక రెహమాన్ పాటలు, మణిరత్నం మార్క్ ఫ్రేమ్స్ తో విడుదలైన ట్రైలర్ అంచనాలను మరింత పెంచింది. మరి సినిమా ఏ స్థాయిలో ఉంది, ఆడియన్స్ ను పూర్తిస్థాయిలో ఆకట్టుకోగలిగిందా? లేదా? అనేది చూద్దాం..!! నెల్లూరు నుంచి ముంబై వెళ్లి సెటిలైన గ్యాంగ్ స్టర్ శక్తిరాజు (కమల్ హాసన్) ఓ మాఫియా సామ్రాజ్యాన్ని నడుపుతుంటాడు. చిన్నప్పుడు శక్తిరాజుకి కవచంగా మారి కాపాడిన అమర్ (శింబు)ని తమ్ముడిగా చూసుకుంటూ.. అతడ్ని కుడి భుజంగా దందా కొనసాగిస్తుంటాడు. ఈ క్రమంలో శక్తిరాజుపై అనుకోని విధంగా అటాక్ అవుతుంది. ఆ అటాక్ వెనుక తనవాళ్లు ఉన్నారేమో అని అనుమానిస్తాడు శక్తిరాజు. దాంతో అంతర్యుద్ధం మొదలవుతుంది. ఆ అంతర్యుద్ధం ఎలాంటి తీవ్రమైన పరిస్థితులకు దారి తీసింది? అనేది "థగ్ లైఫ్" కథాంశం. కమల్ హాసన్, శింబు, త్రిష, అశోక్ సెల్వన్, ఐశ్వర్య రాజేష్, నాజర్, జోజు జార్జ్ వంటి మహామహులందరూ ఉన్న ఈ చిత్రంలో తన నటనతో అందరికంటే ఎక్కువ మార్కులు



సంపాదించుకున్న నటి అభిరామి. సెకండాఫ్ లో ఆమె పాత్రను అనవసరంగా వృథా చేశారు కానీ.. ఫస్టాఫ్ లో కనిపించే కాసిన్ని సన్నివేశాల్లో కూడా ఆమె కళ్లల్లో పండించిన భావం చాలా నిక్కచ్చిగా ఉంది. ముఖ్యంగా వంటగది సన్నివేశంలో ఆమె కళ్లల్లో కనిపించిన కోపం, బాధ వంటి ఎమోషన్స్ చాలా రిలేటబుల్ గా ఉంటాయి. ఇక కమల్ మొదలుకొని జోజు జార్జ్ వరకు ప్రతి ఒక్కరూ ఈ తరహా పాత్రల్లో పలుమార్లు మెప్పించినవారే. కమల్ వర్సెస్ శింబు సీన్స్ ఇంకొన్ని ఉంటే బాగుండు అనిపించింది. త్రిష కెరీర్ బెస్ట్ లుక్స్ ఈ సినిమాలోనే అని చెప్పాలి. ఆమె పాత్రకు పెద్దగా ప్రాధాన్యత లేనప్పటికీ.. ఆమె లుక్స్ & కమల్ తో కెమిస్ట్రీ మాత్రం ఆకట్టుకుంటాయి. అలీ ఫజాల్, మహేష్ మంజ్రేకర్ తదితరులు తమ తమ పాత్రలకు న్యాయం చేశారు. మొదటి 10 నిమిషాల సినిమాలో పాత్రధారులకు చేసిన డీ-ఏజింగ్ ఎఫెక్ట్ చాలా పర్ఫెక్ట్ గా సెట్ అయ్యింది. ముఖ్యంగా కమల్ హాసన్ ను చూస్తే "నాయకుడు" రోజులు గుర్తురావడం ఖాయం. ఇప్పటివరకు ఇండియన్ సినిమాల్లో వాడిన డీ-ఏజింగ్ ఎఫెక్ట్స్ లో ఇది ది బెస్ట్ అని చెప్పాలి. రవి కె.చంద్రన్ సినిమాటోగ్రఫీ వర్క్ బాగుంది. మణిరత్నం మార్క్ ఫ్రేమ్స్ పుష్కలంగా కనిపించాయి. ముఖ్యంగా.. హాస్పిటల్ సీన్ లో అశోక్ సెల్వన్ మెట్లు దిగుతూ.. శింబు మెట్లు ఎక్కేప్పుడు పెట్టిన షాట్ భలే ఉంది. అలాగే.. యాక్షన్ బ్లాక్ విషయంలో కూడా మంచి కేర్ తీసుకున్నారు. శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ చాలా క్రిస్ప్ గా ఉంది. ముఖ్యంగా యాక్షన్ బ్లాక్ లో ఎక్కడా డూప్ దొరక్కుండా ఆయన కొన్ని ఫ్రేమ్స్ ను స్పీడప్ చేసిన విధానం మంచి ఎక్స్ పీరియన్స్ ఇచ్చింది. రెహమాన్ సంగీతం ఎందుకో పూర్తిస్థాయి సంతృప్తినివ్వలేకపోయింది. పాటలు వినసొంపుగా ఉన్నా.. అవన్నీ సినిమాలో బిట్ సాంగ్స్ లా మాత్రమే వినిపించడంతో పెద్దగా ఆకట్టుకోలేకపోయాయి. ఇక బ్యాగ్రౌండ్ స్కోర్ లో ఎక్కువగా వినిపించిన "అచ్చె వన్నె పూవా" అనే పాట మరీ రిపీటెడ్ గా వినిపించడం అనేది రుచించలేదు. ఈ సినిమా కథ-స్క్రీన్ ప్లే కమల్ హాసన్ రెడీ చేసిందని, "అమర్ హై" అనే కమల్ రాసుకున్న కథలోని ఓ చిన్న పాయింట్ ను తీసుకొని మణిరత్నం ఈ చిత్రాన్ని తెరకెక్కించాడని కమల్ ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చిన విషయం తెలిసిందే. అందువల్ల మణిరత్నంకి పూర్తిస్థాయి ఫ్రీడమ్ దొరకలేదేమో అనిపించింది. సినిమా మొదలైన 15 నిమిషాలు చాలా ఆసక్తికరంగా ఉంటుంది. మంచి వరల్డ్ బిల్డింగ్ ఉంటుంది. అక్కడక్కడా మణిరత్నం "నవాబ్" పోలికలు కనిపించినా.. బాగుంది అనిపిస్తుంది. కానీ.. పాత్రలను నడిపించిన విధానం ఫస్టాఫ్ ను కాస్త దెబ్బతీయగా.. ఆ పాత్రల క్యారెక్టర్ ఆర్క్ ను డ్రైవ్ చేసిన తీరు సెకండాఫ్ కు మైనస్ గా మారింది. మణిరత్నం నుంచి రెగ్యులర్ & రొటీన్ డ్రామాలు అస్సలు కోరుకోం, అందుకు కారణం ఆయన సెట్ చేసిన స్టాండర్డ్. ఆయన పండించే డ్రామాలో కూడా మంచి ఎమోషన్ ఉంటుంది. "థగ్ లైఫ్"లో ఆ రెండూ మిస్ అయ్యాయి. అసలే పాత్రలు సరిగా ఆకట్టుకోవడం లేదనే నిరాశకి, రొటీన్ & టెంప్లేట్ స్క్రీన్ ప్లే యాడ్ అవ్వడంతో అలసత్వంతో మిన్నకుండడం తప్ప చేసేదేమీ లేక తెరపై కోకొల్లలుగా కనిపిస్తున్న నటీనటులను చూస్తూ కూర్చుండి పోతాం. మణిరత్నం మార్క్ క్యారెక్టర్ ఎస్టాబ్లిష్మెంట్స్ లో మిస్ అవ్వడం అనేది ఈ సినిమాకి బిగ్గెస్ట్ మైనస్. "ఏ ఫిల్మ్ బై మణిరత్నం" అనే టైటిల్ పడ్డాక హీరో ఎవరు, హీరోయిన్ ఎవరు అనేది ఆడియన్స్ పట్టించుకోరు. ఆ ఫ్రేమింగ్స్, ఆ సంగీతం, ఆ పాటల చిత్రీకరణ, ఆ డ్రామా కోసం మాత్రమే సినిమా చూస్తుంటారు.





## వాణీ కపూర్ స్టన్నింగ్ స్టిల్స్

నాని సరసన ఆహా కళ్యాణం( సినిమాలో నటించి అందరినీ మెప్పించిన వాణీ కపూర్ ఆ తర్వాత బాలీవుడ్ లో బిజీ నటిగా మారింది. పలు యాడ్స్, సినిమాలతో బిజీగా ఉన్న వాణి ఎంత బిజీగా ఉన్నప్పటికీ వరుస ఫోటో షూట్లను చేసి వాటిని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఉంటుంది.2024లో విడుదలైన ఖేల్ ఖేల్ మే సినిమాలో వాణీ కపూర్ తో పాటు పలువురు సూపర్ స్టార్స్ నటించారు. అయినప్పటికీ, ఈ సినిమా ఘోర పరాజయం పాలైంది. తాజాగా వాణీ కపూర్ చీతా ఫ్రాక్ లో మెరిసింది. అమ్మడు ఈ థై స్లిట్ ఫ్రాక్ లో మరింత అందంగా కనిపించి తన అందాలను ఆరబోసింది. వాణీ షేర్ చేసిన ఈ ఫోటోలు కుర్రాళ్లకు నిద్ర పట్టనీయకుండా చేస్తున్నాయి.

## రేపే ఢీ రీరిలీజ్‌కు సిద్ధం

మంచు విష్ణు కెరీర్‌లోనే బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన 'ఢీ' చిత్రం ఈ నెల 6న రీరిలీజ్‌కు సిద్ధమవుతున్నది. శ్రీనువైట్ల దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా నాన్‌స్టాప్ కామెడీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్ని మెప్పించింది. శ్రీహరి, బ్రహ్మానందం, సునీల్ పాత్రలు పండించిన హాస్యం గుర్తుండిపోయింది. ప్రస్తుతం రీరిలీజ్‌ల ట్రెండ్ నడుస్తున్న తరుణంలో 'ఢీ' చిత్రాన్ని మరలా ప్రేక్షకులు ముందుకుతీసుకొస్తున్నామని చిత్రబృందం పేర్కొంది. మరోవైపు మంచు విష్ణు నటించిన తాజా భక్తిరస చిత్రం 'కన్నప్ప' ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.




## ఐఆర్‌సీటీసీ కీలక నిర్ణయం

సాధారణంగా రైలు ప్రయాణం చేయాలంటే ముందుగా టికెట్స్ బుక్ చేసుకుంటాము. అలాగే ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో లేదా టికెట్ బుకింగ్ లేని సమయంలో తత్కాల్ టికెట్ల కోసం ప్రయత్నం చేస్తుంటారు. ఈతత్కాల్ టికెట్ బుకింగ్ కోసం రైల్వేలు త్వరలో ఈ-ఆధార్ వెరిఫికేషన్ పనిని ప్రారంభించబోతున్నాయి. దీని ద్వారా నిజమైన ప్రయాణికులు అవసరమైన సమయంలో కన్ఫర్మ్ చేసిన టిక్కెట్లను పొందవచ్చు. దీనికి సంబంధించి రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ టిట్ చేశారు. తత్కాల్ టికెట్ బుకింగ్ మొదటి 10 నిమిషాల్లో ఆధార్‌తో అనుసంధానించబడిన టిక్కెట్లను బుక్ చేసుకునే వ్యక్తులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు రైల్వేలు కూడా తెలిపాయి. తత్కాల్ విండో తెరిచిన మొదటి 10 నిమిషాల్లో IRCTC అధీకృత ఏజెంట్లు కూడా సిస్టమ్‌లో టిక్కెట్లను బుక్ చేసుకోవడానికి అనుమతించరు. అటువంటి పరిస్థితిలో ఆధార్‌తో అనుసంధానించిన అకౌంట్లు ఉన్న వ్యక్తులు టిక్కెట్లను బుక్ చేసుకోవడంలో మరింత సౌలభ్యాన్ని కలిగి ఉంటారని రైల్వే ప్రకటన తెలిపింది. ఇప్పుడు IRCTC ఆధార్‌తో ప్రామాణీకరించని ఈ 11 కోట్ల 80 లక్షల ఖాతాలన్నింటిపై ప్రత్యేక దర్యాప్తు చేయాలని నిర్ణయించింది. అనుమానాస్పదంగా కనిపించే అన్ని ఖాతాలను బ్లాక్ చేస్తారు. తత్కాల్, ప్రీమియం తత్కాల్ సేవల కింద నిజమైన ప్రయాణికులకు మాత్రమే టిక్కెట్లు లభించేలా రైల్వేలు ప్రయత్నిస్తున్నాయి. అటువంటి పరిస్థితిలో తత్కాల్ బుకింగ్ మొదటి 10 నిమిషాల్లో తమ ఖాతాలను ఆధార్‌తో లింక్ చేసే ఖాతాదారులకు ప్రాధాన్యత లభిస్తుంది.

## అల్వాల్ చెరువులో ఆక్రమణలు హైడ్రా కూల్చివేతలు

హైడ్రా అధికారులు మరోసారి బుల్డోజర్లకు పనిచెప్పారు. అల్వాల్‌లోని చిన్నరాయుని చెరువులో ఆక్రమణలు కూల్చివేస్తున్నారు. గురువారం ఉదయాన్నే బుల్డోజర్లు, ఎక్స్‌కావేటర్లతో చిన్నరాయుని చెరువు వద్దకు చేరిన హైడ్రా సిబ్బంది చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా నిర్మించిన భవనాలను నేలమట్టం చేస్తున్నారు. ఇప్పటికే మూడు భవన నిర్మాణాలను కూల్చివేశారు. ఈ క్రమంలో నిర్మాణదారులకు, హైడా అధికారులకు మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకున్నది. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో పోలీసులు, హైడ్రా సిబ్బంది అక్కడ మోహరించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో భవన నిర్మాణాలపై స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో కూల్చివేతలు చేపట్టారు. కాగా, నిజాం కాలంలో 20 ఎకరాల పైచిలుకు విస్తరించిన అల్వాల్ చెరువు.. ఇప్పుడు



తొమ్మిదెకరాలకు పరిమితమైపోయింది. మానవ నిర్మితమైన ఈ చెరువు.. ఒకప్పుడు పశువులు, పక్షులకు ఆవాసంగా.. తాగునీటి అవసరాలు తీర్చే కల్పతరువుగా ఉండేది. ఇప్పుడు తన ప్రాశస్త్యాన్ని, ప్రభావాన్ని క్రమంగా కోల్పోతూ వస్తోంది. గృహ సంబంధ వ్యర్థాలు, కాలుష్యకారకాలు పెరిగి.. చెరువు మొత్తం మురికికూపంగా మారిపోయింది. ఆక్రమణలతో కుచించుకుపోయింది.

## ఎర్రగడ్డ ఆస్పత్రిలో ఫుడ్ పాయిజన్‌పై రేవంత్ సర్కార్ ఆగ్రహం


ఎర్రగడ్డలోని మానసిక వైద్యశాలలో ఫుడ్ పాయిజన్ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ అయ్యింది. ఆసుపత్రిలో ఆహార పదార్థాల సరఫరా కాంట్రాక్టర్‌ను తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా.. ఆర్ఎంవో డాక్టర్ పద్మజను సస్పెండ్ చేసింది. ఎర్రగడ్డ మానసిక వైద్యశాలలో ఫుడ్ పాయిజన్ ఘటనలో ఒకరు మరణించగా.. చాలా మంది అనారోగ్యానికి గురయ్యారు. ఈ ఘటన తెలంగాణ వ్యాప్తంగా కలకలం రేపింది. 92 మంది రోగులు అనారోగ్యానికి గురయ్యారని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. అస్వస్థతకు గురైన బాధితులను పరామర్శించిన మంత్రి.. రోగులకు అందుతున్న వైద్యంపై అడిగి తెలుసుకున్నారు. ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఘటనపై మంత్రి విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం



కాకుండా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఆస్పత్రి డైట్ కాంట్రాక్టర్‌ను తొలగించాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. బాధితులకు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. అస్వస్థతకు గురైన వారందరి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని తెలిపారు. డైయిట్ కారణంగానే ఈ ఫుడ్ పాయిజాన్ జరిగినట్లుగా తెలుస్తోందని అన్నారు. అనారోగ్యం పాలైన వారిలో తీవ్రంగా ఉన్న 18 మందిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించామని మంత్రి దామోదర రాజనర్సింహ వివరించారు. మిగతా రోగులని గాంధీ, ఉస్మానియాతో పాటు మొత్తం ఆరు వైద్య బృందాలు పర్యవేక్షిస్తున్నాయని వెల్లడించారు. అనారోగ్యం పాలైన వారి ప్రాణాలకు ప్రమాదం లేదని.. వారు మరో రెండు రోజుల్లో కోలుకుంటారని వైద్యులు తెలిపారని చెప్పారు. ఇక్కడ డైట్ చూసుకునే కాంట్రాక్టర్ పనితీరు సైతం సరిగా లేదని సమాచారం అందిందని.. అతని కాంట్రాక్ట్ రద్దు చేశామని తెలిపారు మంత్రి దామోదర రాజనర్సింహ. జరిగిన ఘటనపై ఒక కమిటీని నియమించాయని.. కమిటీ రిపోర్టు రాగానే బాధ్యులపై చర్యలు ఉంటాయని అన్నారు.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# ట్రంప్ సంచలన నిర్ణయం



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, యెమెన్ సహా 12 దేశాలను లక్ష్యంగా చేసుకుని కొత్త ప్రయాణ నిషేధంపై సంతకం చేశారు. తన మొదటి పదవీకాలం నుండి అత్యంత వివాదాస్పద చర్యలలో ఒకటైన ఈ నిషేధాన్ని మరోసారి అమలు చేయనున్నారు. కొలరాడోలో యూదుల నిరసనపై తాత్కాలికంగా జరిగిన ఫ్లేమ్‌త్రోవర్ దాడి, ఆ దాడికి చట్టవిరుద్ధంగా ఆ దేశంలోకి ప్రవేశించిన వ్యక్తిని అమెరికా అధికారులు నిందించడంతో ఈ చర్యకు కారణమైందని ట్రంప్ అన్నారు. ఆఫ్ఘనిస్తాన్, మయన్మార్, చాడ్, రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఈక్వటోరియల్ గినియా, ఎరిట్రియా, హైతీ, ఇరాన్, లిబియా, సోమాలియా, సూడాన్ యెమెన్‌లపై ఈ నిసేధం విధించారు. బురుండి, క్యూబా, లావోస్, సియెర్రా లియోన్, టోగో, తుర్క్మెనిస్తాన్ మరియు వెనిజులా అనే ఏడు దేశాల ప్రయాణికులపై ట్రంప్ పాక్షిక నిషేధం విధించారు. ఈ ఆదేశాలు సోమవారం నుంచి అమల్లోకి వస్తాయని వైట్ హౌస్ తెలిపింది. "కొలరాడోలోని బౌల్డర్‌లో ఇటీవల జరిగిన ఉగ్రవాద దాడి, సరైన తనిఖీ లేని విదేశీ పౌరుల ప్రవేశం వల్ల మన దేశానికి ఎదురయ్యే తీవ్ర ప్రమాదాలను నొక్కి చెప్పింది" అని ట్రంప్ ఓవల్ కార్యాలయం నుండి ఎక్స్‌లో పోస్ట్ చేసిన వీడియో సందేశంలో అన్నారు. ట్రంప్ తన మొదటి పదవీకాలంలో అనేక ముస్లిం దేశాలపై విధించిన "శక్తివంతమైన" నిషేధంతో కొత్త చర్యలను పోల్చారు. దీని వలన ప్రపంచవ్యాప్తంగా ప్రయాణాలకు భారీ అంతరాయం ఏర్పడింది. 2017 నిషేధం అమెరికాను యూరప్‌లో జరిగిన ఉగ్రవాద దాడుల నుండి కాపాడిందని ట్రంప్ అన్నారు. "సురక్షితంగా, విశ్వసనీయంగా తనిఖీ చేయలేని ఏ దేశం నుండి అయినా మనం బహిరంగ వలసలను అనుమతించకూడదు. అందుకే ఈ రోజు నేను యెమెన్, సోమాలియా, హైతీ, లిబియా అనేక ఇతర దేశాలపై ప్రయాణ ఆంక్షలు విధిస్తూ కొత్త కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేస్తున్నాను." అని ట్రంప్ పేర్కొన్నారు. అయితే ట్రంప్ కొత్త ప్రయాణ నిషేధం చట్టపరమైన సవాళ్లను ఎదుర్కోవలసి రావచ్చు. "వేసవి సాయంత్రం" వేడుకలో దాదాపు 3,000 మంది రాజకీయ నియామకాలను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగించిన నిమిషాల తర్వాత, ఎటువంటి హెచ్చరిక లేకుండానే వైట్ హౌస్ కొత్త నిషేధాన్ని ప్రకటించింది. ట్రంప్ కూడా అసాధారణంగా విలేకరులు లేకుండానే ఈ ప్రకటన చేశారు. ఓవల్ కార్యాలయంలో జర్నలిస్టుల సమక్షంలో జరిగిన సంతకాల వేడుకల్లో ఆయన తన అత్యంత సంచలనాత్మక విధాన ప్రకటనలను ఆవిష్కరించారు. వీసాలపై అమెరికాలో నివసిస్తున్న "ఉగ్రవాదులను" వెంటాడతామని కూడా పేర్కొన్నారు. హమాస్ నిర్బంధించిన ఇజ్రాయెల్ బందీలకు మద్దతుగా ఆదివారం గుమిగూడిన వ్యక్తులపై అనుమానితుడు మహ్మద్ సబ్రీ సోలిమాన్ అగ్నిమాపక బాంబులు విసిరి, మండే గ్యాసోలిన్ చల్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. సోలిమాన్ చట్టవిరుద్ధంగా దేశంలో ఉన్నారని, పర్యాటక వీసా గడువు ముగిసిన తర్వాత కూడా అక్కడే ఉన్నారని, కానీ అతను సెప్టెంబర్ 2022లో ఆశ్రయం కోసం దరఖాస్తు చేసుకున్నాడని యూఎస్ హోంల్యాండ్ సెక్యూరిటీ అధికారులు తెలిపారు. "మన దేశానికి వచ్చి మనకు హాని కలిగించాలనుకునే ప్రమాదకరమైన విదేశీయుల నుంచి అమెరికన్లను రక్షించడానికి అధ్యక్షుడు ట్రంప్ తన హామీని నెరవేరుస్తున్నారు" అని వైట్ హౌస్ డిప్యూటీ ప్రెస్ సెక్రటరీ అబిగైల్ జాక్సన్ ఎక్స్‌లో అన్నారు. ట్రంప్ నిషేధ ప్రకటనలో ప్రతి దేశానికి నిర్దిష్ట కారణాలను పేర్కొన్నారు. ఇది "విదేశీ ఉగ్రవాదులు, ఇతర జాతీయ భద్రతా" బెదిరింపుల నుండి అమెరికాను రక్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెబుతుంది. తాలిబాన్ పాలిత ఆఫ్ఘనిస్తాన్, యుద్ధంలో దెబ్బతిన్న లిబియా, సూడాన్, సోమాలియా, యెమెన్‌లకు, పాస్‌పోర్ట్‌లను ప్రాసెస్ చేయడానికి, తనిఖీ చేయడానికి "సమర్థవంతమైన" కేంద్ర అధికారులు లేరని పేర్కొంది.

## మానుషి చిల్లర్ హాట్ ట్రీట్

సినీరంగంలో ఇప్పుడిప్పుడే కథానాయికగా గుర్తింపు తెచ్చుకుంటుంది ఈ హీరోయిన్. సాధారణంగా మిస్ వరల్డ్ కిరీటం గెలిచిన తర్వాత చాలా మంది అమ్మాయిలు ఇండస్ట్రీలో సత్తా చాటారు. ఐశ్వర్య రాయ్, ప్రియాంక చోప్రా, లారా దత్, సుష్మితా సేన్ ఇలా ఎంతోమంది సినీ పరిశ్రమలో తమదైన ముద్ర వేశారు. వరుస సినిమా ఆఫర్స్ అందుకుంటూ తక్కువ సమయంలోనే స్టార్ డమ్ సొంతం చేసుకున్నారు. కానీ ఇప్పుడు మనం మాట్లాడుకోబోయే అమ్మాయి మాత్రం డిఫరెంట్. మిస్ వరల్డ్ కిరీటాన్ని గెలుచుకుంది.. కానీ ఇండస్ట్రీలో సరైన క్రేజ్ మాత్రం అందుకోలేకపోతుంది. ఇప్పటివరకు 5 సినిమాల్లో నటించింది. కానీ ఆ సినిమాలన్నీ డిజాస్టర్స్ అయ్యాయి. దీంతో ఈ బ్యూటీకి ఇప్పటివరకు ఎలాంటి గుర్తింపు రాలేదు.. ప్రస్తుతం ఈ అమ్మడు సక్సెస్ కోసం వెయిట్ చేస్తోంది. ఆమె మరెవరో కాదు.. హీరోయిన్ మానుషి చిల్లర్. ఆ తర్వాత అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ కలిసి అలయ ఎఫ్ స్టార్స్ సినిమా సైతం బిగ్గెస్ట్ ఫ్లాప్ గా నిలిచింది. ఆ తర్వాత ఆమె నటించిన తారిఖ్ చిత్రం డిజాస్టర్ అయ్యింది. మెగా హీరో వరుణ్ తేజ్ జోడిగా ఆపరేషన్ వాలెంటైన్ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. డైరెక్టర్ శక్తి ప్రతాప్ సింగ్ తెరకెక్కించిన ఈ సినిమా కూడా అంతగా మెప్పించలేకపోయింది.



## బెంగళూరు తొక్కిసలాటపై విరాట్ కోహ్లీ భావోద్వేగం




18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఐపీఎల్ టైటిల్ సాధించిన ఆర్సీబీ.. బెంగళూరులో చేపట్టిన విజయోత్సవాలు విషాదంగా మారాయి. ఆర్సీబీ ప్లేయర్లకు ఘన స్వాగతం పలికేందుకు కర్ణాటక ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అయితే ఊహించిన దానికంటే భారీ సంఖ్యలో ఫ్యాన్స్ తరలిరావడంతో చిన్నస్వామి స్టేడియం పరిసరాల్లో తొక్కిసలాట ఏర్పడింది. చిన్నస్వామి పూర్తి కెపాసిటీ సుమారు 30 వేలు కాగా.. ఏకంగా 3 లక్షల మంది ఫ్యాన్స్ వచ్చినట్లు సమాచారం. దీంతో తొక్కిసలాట జరిగిన 11 మంది చనిపోగా.. మరో 50 మందికి పైగా గాయపడ్డట్లు సమాచారం. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సహా పలువురు ప్రముఖులు స్పందించారు. తాజాగా ఈ ఘటనపై విరాట్ కోహ్లీ, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్పందించింది. ఈ మేరకు ఆర్సీబీ ప్రకటన విడుదల చేసింది. ఆ స్టేట్ మెంట్‌ను షేర్ చేస్తూ విరాట్ కోహ్లీ.. సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టాడు. "తొక్కిసలాట ఘటన గురించి తెలుసుకున్నాక మాటలు రావడం లేదు. ఇది తీవ్రంగా కలచివేసింది" అని కోహ్లీ స్పందించాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరణించిన వారి కుటుంబాలకు సంతాపం ప్రకటించింది. "చిన్నస్వామి స్టేడియం బయట తొక్కిసలాట విషయం తెలిసి.. తీవ్రంగా కలత చెందాం. మీడియా ద్వారా ఈ విషయం తెలుసుకున్నాం. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలుపుతున్నాం. మా ఫ్యాన్స్ అందరూ క్షేమంగా ఉండాలని మేం కోరుకుంటున్నాం. ఈ మధ్యాహ్నం జట్టు రాకను అంచనా వేస్తూ బెంగళూరు అంతటా అభిమానులు భారీ ఎత్తున గుమిగూడటంతో ఈ ఘటన జరిగింది. దీని గురించి తెలిసిన వెంటనే మా కార్యక్రమాలను రద్దు చేసుకున్నాం. ప్రతి ఒక్కరి భద్రత, శ్రేయస్సు మాకు అత్యంత ముఖ్యం. స్థానిక అధికారులకు పూర్తిగా సహకరిస్తాం. దయచేసి అందరూ సురక్షితంగా ఉండండి" అని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది.

## లాభాల్లో స్టాక్ మార్కెట్లు



బుధవారం లాభాలను ఆర్జించిన దేశీయ సూచీలు గురువారం కూడా అదే ధోరణిలో కదలాడుతున్నాయి. అంతర్జాతీయంగా మిశ్రమ సంకేతాల నేపథ్యంలో గురువారం ఉదయం ఫ్లాట్‌గా మొదలైన సూచీలు, హెవీ వెయిట్ షేర్లలో కొనుగోళ్ల కారణంగా లాభాల్లోకి వచ్చాయి. కనిష్టాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపడం కూడా కలిసి వచ్చింది. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో పయనిస్తున్నాయి. బుధవారం ముగింపు (80, 998)తో పోల్చుకుంటే గురువారం ఉదయం 190 పాయింట్లతో మొదలైన సెన్సెక్స్ కాసేపు లాభనష్టాలతో దోబూచులాడింది. ఆ తర్వాత లాభాల్లోకి ప్రవేశించింది. ఒక దశలో 460 పాయింట్లకు పైగా లాభపడింది. ప్రస్తుతం ఉదయం 10:30 గంటల సమయంలో 316 పాయింట్ల లాభంతో 81, 315 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడుతోంది. ప్రస్తుతం 97 పాయింట్ల లాభంతో 24, 718 వద్ద కదలాడుతోంది. అమెరికా మార్కెట్లు బుధవారం ఫ్లాట్‌గా ముగిశాయి. ఆసియా మార్కెట్లు ప్రస్తుతం మిశ్రమంగా కదలాడుతున్నాయి.



నెటిజన్ల ట్రోలింగ్‌తో కీలక నిర్ణయం తీసుకున్న

## రాజేంద్ర ప్రసాద్

మంచి టాలెంట్ ఉన్న నటుడు రాజేంద్ర ప్రసాద్ ఈ మధ్య సభా సంస్కారం మరిచిపోయి తప్పడు కామెంట్స్ చేస్తుండడంతో విమర్శల పాలవుతున్నారు. ఆ మధ్య వార్నర్‌పై అసభ్యకరమైన కామెంట్స్ చేసిన రాజేంద్ర ప్రసాద్.. లీసెంట్‌గా దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి బర్త్ డే సెలబ్రేషన్స్ లో అలీని ఉద్దేశించి బూతు పదాన్ని ఉపయోగించి మాట్లాడాడు. అలానే నటి రోజాపై కూడా తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో రాజేంద్రప్రసాద్‌పై తీవ్ర వ్యతిరేఖకత వ్యక్తం అవుతుంది. ఆయనని దారుణంగా ట్రోల్ చేస్తున్నారు. అయితే రాజేంద్రప్రసాద్ ఉద్దేశ్యపూర్వకంగా తనపై కామెంట్స్ చేయలేదని అలీ స్వయంగా వివరణ ఇచ్చిన కూడా కొందరు మధ్యలోకి వచ్చి దారుణంగా ట్రోల్ చేస్తున్నారు. పలు సందర్భాల్లో రాజేంద్రప్రసాద్ నోరు జారడం, ఆ తర్వాత క్షమాపణ చెప్పడం కామనే అని అంటున్నారు. పెద్ద ఇష్యూ నడుస్తున్న సమయంలో రాజేంద్ర ప్రసాద్‌కి పశ్చాత్తాపం కూడా లేకపోగా, తాను మాట్లాడే మాటలను తప్పగా అర్థం చేసుకుంటున్నారని.. అది వాళ్ళ ఖర్మ.. సంస్కారం మీద ఆధారపడి ఉంటుందని చెప్పడం ఏంటి? అంటూ దుమ్మెత్తిపోస్తున్నారు. రాజేంద్ర ప్రసాద్ కూతురు చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్నారని, అమ్మలాంటి బిడ్డ చనిపోవడంతో బాధలో ఉన్నాడని, కావాలని ఆయన అలా మాట్లాడలేదని ఆలీ వివరణ ఇచ్చిన కూడా కొందరు మాత్రం ఈ విషయంపై గట్టిగానే తమ వాదన వినిపిస్తున్నారు. ఈ క్రమంలో రాజేంద్ర ప్రసాద్ కీలక నిర్ణయం తీసుకున్నాడు.


## నెల్లూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలంలోని ఏఎస్ పేట క్రాస్ రోడ్డు వద్ద గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా.. 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఆటోను కారు ఢీకొన్న ఈ ఘటనలో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. కూలీలు వెంకటరావుపల్లి నుంచి ముస్తాపురంకు ఆటోలో వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.మరోవైపు రెండు రోజుల క్రితం ఉమ్మడి నెల్లూరు జిల్లా, ఓజిలీ మండలం, రాచపాలెం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్, ఎల్బీనగర్‌కు చెందిన 11 మంది పెద్దలు, ముగ్గురు చిన్నారులు టెంపోలో విహారయాత్రకు వెళ్లారు. రాచపాలెం జాతీయ రహదారివద్దకు వచ్చేసరికి టెంపో డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో టెంపో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ప్రశాంతి, అంజమ్మ, సబిత అనే ముగ్గురు తీవ్రంగా గాయపడగా, మిగిలినవారు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో గూడూరులో ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అరావళీ గ్రీన్ వాల్ ప్రాజెక్ట్ ప్రారంభించిన ప్రధాని మోదీ



ఈ రోజు అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా దక్షిణ ఢిల్లీలో అరావళీ గ్రీన్ వాల్ ప్రాజెక్ట్‌ను రీలాంచ్ చేశారు ప్రధాని నరేంద్ర మోదీ. ఈ కార్యక్రమంలో భాగంగా ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భగవాన్ మహావీర్ వనస్థలి పార్క్‌లో మర్రిచెట్టును నాటారు ప్రధాని మోదీ. దేశంలో పచ్చదనం వెల్లివిరిసేలా ఎన్డీఏ ప్రభుత్వం చెట్లు నాటే కార్యక్రమాలను చేపట్టింది. అరావళీ పర్వత శ్రేణులు విస్తరించిన హర్యానా, రాజస్థాన్, గుజరాత్, ఢిల్లీ రాష్ట్రాల్లోని 29 జిల్లాల్లో చెట్లు పెంచి అడవులను పెంచి పర్యావరణ పరిరక్షణ లక్ష్యంతో కేంద్రం ఈ గ్రీన్ బెల్ట్ కార్యక్రమం కొనసాగిస్తోంది. ఈ ప్రాజెక్ట్ రీ లాంచింగ్ కార్యక్రమంలో నాలుగు రాష్ట్రాల సీఎంలు పంచుకున్నారు. ఢిల్లీ సీఎం రేఖా గుప్తా ప్రధాని మోదీతో పాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హర్యానా సీఎం నాయబ్ సింగ్ సైనీ దాద్రిలో ఈ కార్యక్రమంలో పాల్గొనగా, గుజరాత్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ కేడాలో, రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ రామ్‌గర్‌లో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




## ఏడుగురు సీనియర్ ఐపీఎస్ అధికారుల బదిలీ

రాష్ట్రంలో ఏడుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా అభిలాష బిస్త్, మహిళా భద్రత విభాగం, సీఐడీ అదనపు డీజీగా చారు సిన్హా, ఎఫ్ఎసల్ఎల్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్‌గా శిఖా గోయల్‌ను నియమించారు.హైదరాబాద్ సిటీ ఎస్‌బీ డీసీపీగా ఉన్న ఎస్. చైతన్యకుమార్‌ను సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీగా నియమించగా, ఆ పదవిలో ఉన్న పాటిల్ కాంతిలాల్ సుభాష్‌ను కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. మైనారిటీ వెల్ఫేర్‌లో ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న తఫ్సీర్ ఇక్బాల్‌ను చార్మినార్ రేంజ్ డీఐజీగా, మెదక్ ఎస్పీగా డీవీ శ్రీనివాసరావును బదిలీ చేశారు.